సాక్షి
కరీంనగర్
శనివారం । 15 । ఏప్రిల్ । 2023



కోటేశ్వరస్వామికి మొక్కులు

వెల్గటూర్(ధర్మపురి): శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ సంకటాల మల్లేశ్ దంపతులు శుక్రవారం కోటిలింగాల శ్రీకోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.



ఎండాకాలం.. పిల్లలు భద్రం

వేసవి ప్రారంభమైంది. విద్యాసంస్థలకు సెలవులు ఇస్తున్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై కాస్త కన్నేసి ఉంచండి.

-IIలో▸

గరిష్ఠం/కనిష్ఠం
40.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు, రాత్రి చలిగాలులు వీస్తాయి.





చెరువులోంచి బాలుడిని తీసుకొస్తున్న ఈతగాళ్లు

'ఒక్కగానొక్క కొడుకువు కదరా బిడ్డా..
నీ సదువు కోసం ఊరుగాని ఊరు వచ్చినం కదరా..
ఇప్పుడు నువ్వు మమల్ని ఇడ్సి పెట్టిపోతివారా' అంటూ ఓ తల్లి..

'నీ సదువును సూసి మురిసిపోతిమి కదరా..
మంచిగా సదువుకొని మమ్మల్ని సాత్తవనుకుంటిమి కదా బిడ్డా..
పాపపు చెరువు నీపాణం తీసే కదరా కొడుకా' అంటూ.. మరో తల్లి..

క్రికెట్ క్రికెట్ అంటూ బ్యాటు పట్టుకుని తిరుగుతుంటివి..
కొడుకు ఎక్కన్నో ఆడుకుంటుండనుకున్నం..
ఇట్ల నిన్ను జీవం లేకుండా చూస్తమనుకోలే తండ్రీ..
బడి ఉంటే బతికేటోళ్లు కదరా.. దేవుడా..!!

... అంటూ ఆ పిల్లల తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించిన తీరు ప్రతి ఒక్కరినీ కన్నీరు పెట్టించింది. పనిచేస్తే కానీ పూటగడవని కుటుంబాలు. పొద్దుగాలనే కూలిపనికి పోయేటోళ్లు. పిల్లలను చూసుకుంటూ బతుకుతున్న తల్లిదండ్రులు. అన్నం, కూర వండి.. 'తినుండ్రి బిడ్డా.. సాయంత్రం వస్తాం' అన్ని చెప్పి వెళ్లిన ఆ తల్లిదండ్రులు పిల్లల మరణవార్త విని ఒక్కసారిగా ఘొల్లుమన్నారు. ఆ పాపపు చెరువు మిమ్మల్ని మింగిందా కొడుకా అంటూ రోదించారు. పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ న్యూపోరట్‌పల్లికి చెందిన ముగ్గురు విద్యార్థులు శుక్రవారం మేడిపల్లి శివారులోని పెద్దచెరువులో ఈతకు వెళ్లి మరణించడం ఆ తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చింది. శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటన రామగుండం ప్రాంతాన్ని కన్నీరు పెట్టించింది.

– గోదావరిఖని/జ్యోతినగర్(రామగుండం)

బడి ఉంటే బతికేటోళ్లు కదా బిడ్డా..

పాపపు చెరువు ప్రాణాలు తీసింది కదరా.. విషాదంలో న్యూపోరట్‌పల్లి

- కన్నీరు మున్నీరైన చిన్నారుల తల్లిదండ్రులు
- పిల్లలు ముగ్గురూ ప్రాణ స్నేహితులు
- ఘొల్లుమన్న గోదావరిఖని ఏరియా ఆస్పత్రి ప్రాంగణం
- అందరివీ పేద కుటుంబాలే..

సెలవు దినమని..

రామగుండం ఎన్టీపీసీ పరిధిలోని న్యూపోరట్‌పల్లికి గ్రామానికి చెందిన సోయం ఉమామహేశ్వర్(12), మామిడి విక్రం (13), మేకల సాయిచరణ్(13), ఇల్లుటం శశి స్నేహితులు. వీరి ఇండ్లు పక్కపక్కనే ఉంటాయి. శుక్రవారం అంబేడ్కర్ జయంతి సెలవు రోజు కావడంతో ఇంటివద్దే ఉన్నారు. వారి తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లారు. నలుగురు కలిసి క్రికెట్ ఆడేందుకు బయటకు వెళ్లారు. గంటసేపు క్రికెట్ ఆడిన తరువాత గ్రామానికి దాదాపు 200 మీటర్ల దూరంలో ఉన్న మేడిపల్లి చెరువు వద్దకు ఈతకని సైకిళ్లపై వెళ్లారు. ఉమామహేశ్వర్, మామిడి విక్రం, మేకల సాయిచరణ్ చెరువుకట్టపై బట్టలు ఉంచి చెరువులోకి ఈతకొట్టేందుకు దిగారు. సమీపంలో ఉన్న తన తాత దగ్గరికి శశి వెళ్లాడు. పది నిమిషాల తరువాత వచ్చేసరికి ముగ్గురు స్నేహితులు నీటిలో మునిగిపోతున్నట్లు కనిపించారు. దీంతో శశి ఆందోళనకు గురయ్యాడు.

చుట్టు పక్కలవారు గమనించి..

చెరువుకు సమీపంలో ఉన్న మామిడి రమేశ్, మేకల రాములు పిల్లలు మునిగిపోతున్నట్లు గమనించారు. వారికీ ఈత రాకపోవడంతో గ్రామానికి చెందిన ఆరెందుల చంద్రయ్య, కారెంగుల మల్లేశ్, కాళ్ల శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చారు. వారు పది నిమిషాల వ్యవధిలో చెరువులోకి దిగారు. ముగ్గురు పిల్లలు నీట మునిగి కనిపించారు. వెంటనే బయటకు తీసుకొచ్చారు. నీళ్లు మింగారని సీపీఆర్‌చేసి బతికించే ప్రయత్నం చేశారు. ముత్తునూరి సంపత్‌కు చెందిన ఆటోలో గోదావరిఖని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పిల్లలు ముగ్గురు చనిపోయారని చెప్పారు. శశి తన తాత దగ్గరకు వెళ్లడంతో అతని ప్రాణాలు దక్కాయి.

మిన్నంటిన రోదనలు

ముగ్గురు పిల్లలు చెరువులో మునిగారన్న సమాచారంతో వారి తల్లిదండ్రులు ఏరియా ఆస్పత్రికి చేరుకున్నారు. చిన్నారుల మృతదేహాలను చూసి గుండెలవిసేలా రోదించారు. వారి మిత్రులు, బంధువుల రాకతో ఆస్పత్రి దుఃఖసాగరంలో మునిగిపోయింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించగా.. విక్రం మృతదేహాన్ని స్వగ్రామమైన కాల్వశ్రీరాంపూర్ మండలం మడిపెల్లి గ్రామానికి తీసుకెళ్లారు. సాయిచరణ్ అంత్యక్రియలు పూర్తికాగా.. ఉమా మహేశ్వర్‌వి నేడు చేయనున్నారు. గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్, ఎన్టీపీసీ సీఐ చంద్రశేఖర్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు మృతుల కుటుంబాలను ఓదార్చారు. ఎన్టీపీసీ ఎస్సై జీవన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చెరువులో పేరుకుపోయిన అండు కారణంగానే చిన్నారులు చనిపోయి ఉంటారని స్థానికులు భావిస్తుండగా.. అప్పటివరకు కలిసిమెలిసి తిరిగిన పిల్లలు కాటికి చేరడంతో న్యూపోరట్‌పల్లి గ్రామం నిశ్శబ్దంగా మారింది.



ఏరియా ఆస్పత్రి వద్ద రోదిస్తున్న చిన్నారుల కుటుంబ సభ్యులు

ప్రమాద సమయమిలా.. (సుమారు)

ఉ.9:00: తల్లిదండ్రులు కూలిపనులకు వెళ్లారు
10:00: పిల్లలు నలుగురు ఒక్కచోట చేరి క్రికెట్ ఆడారు
11:00: చెరువు వద్దకు వెళ్లారు
11:15 చెరువులోకి ముగ్గురు దిగారు
11:20: అందులో మునిగిపోయారు
11:25: సమీపంలో ఉన్నవారు గమనించారు
11:35: కొందరు చెరువులోకి దిగారు
11:40: చిన్నారులను బయటకు తీశారు
12:00 ఆటోలో ఆస్పత్రికి తరలించారు
12:20: పిల్లలు ముగ్గురు మరణించారని వైద్యులు ధ్రువీకరించారు

పుత్రశోకాన్ని మిగిల్చి..



బాలుడికి సీపీఆర్ చేస్తున్న స్థానికులు

- స్థానికంగా బట్టలు ఇస్త్రీ పనిచేసుకుని జీవనోపాధి పొందే మామిడి రమేశ్– లక్ష్మి దంపతులకు కూతురు– కొడుకు విక్రం సంతానం. వీరిది స్వగ్రామం కాల్వశ్రీరాంపూర్ మండలం మడిపెల్లి. పిల్లల చదువుకోసం న్యూపోరట్‌పల్లిలో కొన్నేళ్లుగా అద్దెకు ఉంటున్నారు. విక్రం స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఇటీవలే బర్త్‌డే జరుపుకున్న విక్రం ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయంలో ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డాడు.
- న్యూపోరట్‌పల్లి గ్రామానికి చెందిన సోయం జనార్దన్– క్రిష్ణవేణి దంపతులకు ఇద్దరు కొడుకులు. చిన్నవాడు ఉమామహేశ్వర్. జనార్దన్ ఆటో నడుపుతుంటాడు. క్రిష్ణవేణి కూలిపని చేస్తుంటుంది. ఉమా మహేశ్వర్ స్థానిక దుర్గయ్యపల్లె ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఉమామహేశ్వర్ చదువులో ముందుంటాడు. ఉన్నతంగా చదివిద్దామనుకుంటే అందకుండా పోయావా అంటూ తల్లిదండ్రులు రోదించిన తీరు కలిచివేసింది.
- ఇదే గ్రామానికి చెందిన మేకల రాములు– సునీత దంపతుల పెద్ద కుమారుడు సాయిచరణ్(13). మిల్లర్‌పై కూలీ పనిచేసుకుంటేనే పూటగడిచే స్థితిలో రాములు కుటుంబం ఉంది. అతని భార్య కూడా కూలిపని చేస్తుంటుంది. ఎన్టీపీసీ జ్యోతినగర్ దుర్గయ్యపల్లె ప్రభుత్వ పాఠశాలలో సాయిచరణ్ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. క్రికెట్ ఆటలో మంచి ప్రావీణ్య ఉన్న వ్యక్తి. క్రికెట్ ఆడేందుకు వెళ్లి చెరువులో దిగి ప్రాణాలు పోగొట్టుకున్నాడు.

విర్రవీగుతూ నడవకండి. విర్రవీగి భూమిని చీల్చలేరు. పర్వతాలను ఎత్తలేరు.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
శని 6:36	ఆది 4:33

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

జమిడిక పుస్తకం ఆవిష్కరణ



కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఫిలింభవన్‌లో కవి కందుకూరి అంజయ్య రచించిన జమిడిక పుస్తకాన్ని ప్రముఖ కవి డాక్టర్ శిఖామణి, అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని సీనియర్ పాత్రికేయ కవి నగునూరి శేఖర్‌కు అంకితమిచ్చారు. పుప్పాల శ్రీరామ్, బూర్ల వెంకటేశ్వర్లు జమిడక పుస్తక సమీక్షను నిర్వహించారు. కార్యక్రమంలో కవులు గాజోజు నాగభూషణం, అన్నవరం దేవేందర్, జనసేనన్, తోట నిర్మలారాణి, ఎక్కలదేవి మధుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

యువతి, బాలికను రక్షించిన లేక్ పోలీసులు

కరీంనగర్‌క్రైం: మానేరు డ్యాంలో శుక్రవారం ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన యువతి, బాలికను కరీంనగర్ లేక్ పోలీసులు రక్షించారు. పోలీసుల వివరాలు.. సిద్దిపేట జిల్లా నంగునూరుకు చెందిన మానిక (22), మరో బాలిక (17) ఆత్మహత్యకు పాల్పడేందుకు డ్యాం నీటిలోకి దిగుతుండగా గస్తీలో ఉన్న లేక్ పోలీసులు గుర్తించి వారిని నిలువరించారు. కుటుంబ ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు విచారణలో బాధితులు పేర్కొన్నారు. వారికి లేక్ అవుట్ పోస్ట్ ఆర్ఎస్ఐ ఎ.సురేశ్ కౌన్సెలింగ్ నిర్వహించి మహిళా పోలీస్ స్టేషన్లో అప్పగించారు. కాగా ఇద్దరిని రక్షించడంలో కీలకపాత్ర పోషించిన కానిస్టేబుళ్లు కె.వీరస్వామి, ఎండీ సప్దార్ అలీని కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బరాయుడు అభినందిస్తూ రివార్డులు ప్రకటించారు.

దళితబంధు అమలు, నిర్వహణ భేష్



అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న ప్రకాశ్ యశ్వంత్, మంత్రి కమలాకర్, తదితరులు



దళితబంధు లబ్ధిదారులతో కేక్ కట్ చేస్తున్న ప్రకాశ్

- పథకం అమలులో హుజూరాబాద్ దేశానికే ఆదర్శం
- జిల్లా యంత్రాంగాన్ని కొనియాడిన ప్రకాశ్ యశ్వంత్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/హుజూరాబాద్/జమ్మికుంట: దళితబంధు పథకం అమలు, నిర్వహణ భేష్ అని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ మనవడు, మాజీ ఎంపీ ప్రకాశ్ యశ్వంత్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని ఆయన హుజూరాబాద్‌లోని దళితబంధు యూనిట్లను పరిశీలించారు. ఇందు కోసం ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో మంత్రి గంగుల కమలాకర్, పార్టీ విప్ బాల్క సుమన్‌తో కలిసి హుజూరాబాద్ వచ్చారు. ఆయనకు జిల్లా ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ కర్ణన్, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, సీపీ సుబ్బారాయుడు, జెడ్పీ సీఈవో ప్రియాంక తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన జమ్మికుంట, హుజూరాబాద్‌లో దళితబంధు యూనిట్లను ప్రారంభించారు. కొందరు లబ్ధిదారులతో మాట్లాడారు. వారి ఆర్థికాభివృద్ధిలో గతానికి, ఇప్పటికి వచ్చిన మార్పును అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో మాట్లాడి ఫలితాలు తెలుసుకున్నారు. హుజూరాబాద్‌లో విజయవంతం అవడం వెనక జిల్లా అధికారులను అభినందించడంతో వేదికపై ఉన్న అధికారులు గట్టిగా చప్పట్లు చరిచారు. అనంతరం మంత్రి గంగుల ఫిలిగ్రీతో తయారు చేసిన జ్ఞాపికను ప్రకాశ్ యశ్వంత్‌కు ఇచ్చి సత్కరించారు. జ్యూట్ బ్యాగుల కంపెనీల యజమాని శారద తన పరిశ్రమలో తయారైన సంచులను ఆయనకు బహూకరించారు. అంతకుముందు అను గోల్డెన్ బేకరీలో అంబేడ్కర్ రూపంతో తయారుచేసిన కేక్‌ను కట్ చేశారు. భగవతి జనరల్ స్టోర్, గాయత్రి ఫ్యాబ్రిక్ సారీ సెంటర్‌లను సందర్శించారు. హుజూరాబాద్‌లో జ్యూట్‌తోపాటు పలు యూనిట్లు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు తక్కలపల్లి రాజేశ్వరరావు, గందె రాధిక శ్రీనివాస్, వైస్ చైర్మన్ స్వప్న కోటి తదితరులు పాల్గొన్నారు.

బేకరీలో పనిచేసి యజమానిగా స్థిరపడ్డా



గతంలో బేకరీలో వర్కర్‌గా పనిచేసేవాడిని. దళితబంధు పథకానికి ఎంపికయ్యాను. ఇప్పుడు జమ్మికుంటలో బేకరీ నిర్వహిస్తున్నాను. మరో ఆరుగురు వర్కర్లకు పని కల్పిస్తున్నాను. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన మనవడు ప్రకాశ్ యశ్వంత్ అంబేడ్కర్ మా షాపునకు వస్తున్నారని ప్రత్యేక కేక్ తయారు చేయించా. ఆయనతో కేక్ కట్ చేయించడం జీవితంలో మర్చిపోలేని గుర్తు.

– భైరుమల్ల అనిల్, గోల్డెన్ బేకరీ యజమాని జమ్మికుంట

నేను ఓనర్‌ను అయ్యాను..



దళితబంధు పథకం ప్రారంభం కాకముందు గృహిణిగా ఉండేదాన్ని. స్వశక్తిగా ఎదగాలన్న ఆలోచనలు ఉన్నా.. ఆర్థిక స్థోమత లేకుండే. ఈ పథకం మాలాంటి వారికి వరం. నేను జ్యూట్ బ్యాగుల కంపెనీకి యజమాని అయ్యాను.

– వేల్పుల శారద, హుజూరాబాద్

ఆర్టీసీ బలగాలతో అంతా కూల్

తిమ్మాపూర్(మానకొండూర్): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద గురువారం సాయంత్రం నుంచి ఆర్టీసీ పోలీసులు భారీ బందోబస్తుగా ఉన్నారు. దీంతో శుక్రవారం అంబేడ్కర్ జయంతి వేడుకలు శాంతియుతంగా జరిగాయి. కరీంనగర్ ఆర్ఎం ఖుస్రో ఖాన్, డీఎస్పీ రామ్మూర్తి, సీఐ రవీందర్, డీఎంలు ప్రణీత్, మల్లయ్య గురువారం సాయంత్రం నుంచే బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో దళిత నాయకులు సైతం ఏలాంటి అల్లర్లకు పాల్పడకుండా శాంతియుతంగా అంబేడ్కర్ భవనంలో నివాళులర్పించి హైదరాబాద్ కార్యక్రమానికి పయనమయ్యారు. దీంతో ఆర్టీసీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సుమారు 200 మంది సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. ఎండ అధికంగా ఉండడంతో విగ్రహాల కింద సిబ్బంది సేద తీరారు.



విగ్రహాల కింద సేద తీరుతున్న సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



కరపత్రం ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

హుజూరాబాద్: అగ్నిప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాల కరపత్రంను శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార కూడళ్లు, జన సమూహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాలిన్న చర్యల గురించి అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీ సుబ్బారాయుడు, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ట్రెయినీ కలెక్టర్ లెనిన్ వాట్సల్ టోప్పో, డీసీపీ శ్రీనివాస్, జిల్లా అగ్నిమాపక అధికారి టి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఉషు జిల్లా జట్టు ఎంపిక పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్‌: స్థానిక ఫండస్‌ స్కూల్‌లో శనివారం ఉషు జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి బార విద్యాసాగర్‌ ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర అసోసియేషన్‌ వారు ఈనెల 18న నిజామాబాద్‌ జిల్లా నాగారంలోని రాజారాం ఇండోర్‌ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్స్‌ ఉషు పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణపత్రం, ఫిట్‌నెస్‌ సర్టిఫికెట్‌తో ఉదయం 11 గంటలకు హాజరుకావాలని తెలిపారు.

మృతదేహం ఆచూకీ లభ్యం

హుజూరాబాద్‌: పట్టణంలోని మామిళ్లవాడకు చెందిన లారీ డ్రైవర్‌ ఎండీ షాహిన్‌ బుధవారం అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోగా, గురువారం ఎస్సారెస్పీ కెనాల్‌ వద్ద అతడి వాహనం లభించింది. కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావించిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం పెద్దమ్మ గడ్డ వద్ద మృతదేహం లభ్యం కావడంతో కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు.

ఉపాధ్యాయుడిపై కేసు

ఇల్లందకుంట(హుజూరాబాద్‌): కొంతమంది పోలీసు అధికారులను కించపరిచేలా వివిధ వాట్సాప్‌ గ్రూపుల్లో ప్రచారం చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై శుక్రవారం కేసు నమోదైంది. ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం.. మండలంలోని టేకుర్తి గ్రామానికి చెందిన రాంరాజయ్య అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు గురువారం వాట్సాప్‌ గ్రూపుల్లో పోలీసులను అవమానించేలా, పోలీసులకు ప్రజలకు మధ్య వైషమ్యాలు సృష్టించేలా, పోలీస్‌ ప్రతిష్టకు భంగం కలిగేలా పోస్టులు పెట్టాడు. దీంతో అతడిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. సదరు ఉపాధ్యాయుడిపై గతంలో కూడా పలు క్రిమినల్‌ కేసులు ఉన్నాయని, అతని మితిమీరిన చర్యల వల్ల ఎవరైనా బాధితులు ఉంటే న్యాయం కోసం తమను సంప్రదించాలని పేర్కొన్నారు. ఎవరైనా ఇతరులను కించపరుస్తూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

స్వగ్రామానికి వలస జీవి మృతదేహం


శ్రీనివాస్‌ (ఫైల్‌)

కోనరావుపేట (వేములవాడ): మండలకేంద్రానికి చెందిన బొల్లె శ్రీనివాస్‌ (47) దుబాయ్‌లో మృతి చెందగా వారం తర్వాత మృతదేహం స్వగ్రామానికి చేరింది. శ్రీనివాస్‌ పదేళ్లుగా దుబాయ్‌ వెళ్తున్నాడు. ఆరునెలల క్రితం ఇంటికి వచ్చివెళ్లాడు. ఈనెల 8న ఉదయం శ్రీనివాస్‌ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడాడు. మధ్యాహ్నం విధులకు రాలేదని అక్కడి తోటి కార్మికులు శ్రీనివాస్‌కు ఫోన్‌చేయగా లిఫ్ట్‌ చేయలేదు. దీంతో గదికి వెళ్లి చూడగా విగతజీవుడై కనిపించాడు. గుండెపోటుతోనే మృతిచెందినట్లు వారు భావించారు. శ్రీనివాస్‌ మృతిచెందిన విషయాన్ని వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఇంటికి తెప్పించాలని గ్రామస్తులు ఆద్యగోలి ఫౌండేషన్‌ చైర్మన్‌ గోలి మోహన్‌ను కోరగా, అతడి సహకారంతో శుక్రవారం మృతదేహం స్వగ్రామం చేరింది. మృతుడికి భార్య శోభ, కుమారుడు జెస్టిన్‌, కూతురు జాషువేరి ఉన్నారు.

ఎండాకాలం .. పిల్లలు భద్రం

రామగుండం కార్పొరేషన్‌ రెండో డివిజన్‌ ఇందిరమ్మకాలనీకి చెందిన ముగ్గురు బాలురు శుక్రవారం ఈతకు వెళ్లి చెరువులో మునిగిపోయారు. స్థానికులు గమనించి బయటకు తీసి ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ముగ్గురు బాలురు మృతిచెందారు.

రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో గురువారం మేడ నిఖిల్‌(10) ఎగువ మానేరు కుడికాల్వలో ఈతకు దిగి మృత్యువాత పడ్డాడు. నిఖిల్‌కు ఈత రాకపోవడం.. కాల్వ లోతుగా ఉండడంతో మునిగిపోయాడు.

కరీంనగర్‌ పరిసరాల్లోని తిమ్మాపూర్‌ మండలం రామకృష్ణకాలనీలోని సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద వ్యవసాయ బావిలో గురువారం ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్న 20 మంది విద్యార్థులు ఈతకు వెళ్లారు. ఇందులో పాలిటెక్నిక్‌ సెకండియర్‌ చదువుతున్న నీలపు బాలరాజు(18), వ్యవసాయబావిలో దిగి ఈత రాక గల్లంతయ్యాడు. తోటి విద్యార్థులు 100 నంబర్‌కు కాల్‌ చేయగా పోలీసులు వచ్చి గాలింపు చేపట్టి బాలరాజు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడిది పెద్దపల్లిగా గుర్తించారు.


ఈత కొడుతున్న విద్యార్థులు (ఫైల్‌)

- ఈత సరదాతో ప్రాణాలు పోతున్న వైనం
- ఉమ్మడి జిల్లాలో రెండు రోజుల్లో ఐదుగురి మృతి
- ఈతరాకున్నా స్నానాలకు చెరువుల్లోకి..
- లోతు తెలియక మునుగుతున్న వైనం
- జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ

బోయినపల్లి(చొప్పదండి)/యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): వేసవి సెలవులు ప్రారంభంలోనే ఉమ్మడి జిల్లాలో ఈత కోసం వెళ్లి చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈత రాకపోవడం.. నీటిని చూడడంతోనే సరదాకు దిగాలనిపించడం ప్రాణాలమీదకి తెస్తోంది. వేసవి రాగానే స్కూళ్లకు సెలవులు రావడంతో పిల్లలందరూ ఒకే చోట చేరి ఆడుకుంటుంటారు. ఆ సమయంలో సరదా కోసం ఈతకు వెళ్లి ప్రాణాలమీదికి తెచ్చుకుంటుంటారు. ఇలా సరదా కోసమే ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు గతంలో చాలా జరిగాయి.

జాగ్రత్తలు పాటించాలి

- వేసవి సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో పిల్లల జాగ్రత్తపై తల్లిదండ్రులు దృష్టిసారించాలి.
- ఈత రాకుండా నీటిలోకి దిగితే ప్రాణాలు పోతాయని తలిదండ్రులు తమ పిల్లలకు అవగాహన కల్పించాలి
- వేసవిలో ఈత నేర్చుకునేందుకు వాగులు, వంకలు, బావుల్లోకి దిగకుండా చూడాలి. నిపుణులు లేదా పెద్దల పర్యవేక్షణలోనే ఈత నేర్చుకోవాలని సూచించాలి.
- స్విమ్మింగ్‌పూల్స్‌లోనే ఈత నేర్చుకుంటే ఎలాంటి అపాయం ఉండదు. ఈత నేర్చుకునే సమయంలో నడుముకు ట్యూబ్‌ ఉంచుకోవాలి.
- కాలువలు, చెక్‌డ్యాంలు, వాగులు ప్రమాదకరమైన జలాశయాల్లో కంచెలు ఏర్పాటు చేయాలి
- రెవెన్యూ శాఖ వారు నీరు లోతుగా ఉన్న చెరువులు, కుంటల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
- అలాగే మైనర్లను వాహనాలు సైతం ఇవ్వకపోవడమే మంచిది. లేదంటే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.
- ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న క్రమంలో పిల్లలు ఎండలను సైతం లెక్కచేయకుండా తోటివారితో బయటకు వెళ్లి ఆడుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. దీంతో వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. ఇంటి ఆవరణంలోనే ఆడుకునేలా వారికి సూచించాలి.

పిల్లలపై దృష్టి సారించాలి



పిల్లలు గోదావరి నది, బావులు, చెరువుల్లోకి ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. వారిపై ఎప్పుడూ దృష్టి సారించాలి. 18 ఏళ్ల లోపు పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దు. వేసవి సెలవుల్లో పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి.

– వేణుగోపాల్‌, సీఐ, గోదావరిఖని టూటౌన్‌

బీజేపీ నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

- కొప్పుల రాజు, బలరాంనాయక్‌, పొన్నం ప్రభాకర్‌

కరీంనగర్‌టౌన్‌: అంబేద్కర్‌ అందించిన రాజ్యాంగాన్ని బీజేపీ ఖతం చేయాలని చూస్తుందని ఏఐసీసీ అనుబంధ సంఘాల కన్వీనర్‌ కొప్పుల రాజు, కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్‌, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌ అన్నారు. శుక్రవారం డీసీసీ కార్యాలయంలో అంబేద్కర్‌ జయంతిని ఘనంగా నిర్వహించారు. బాబ సాహెబ్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీజేపీ వల్ల రాజ్యాంగానికి వాటిల్లిన ప్రమాదం నుంచి రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. 9 ఏళ్లలో ఏనాడు అంబేద్కర్‌ చిత్రపటానికి నివాళులర్పించని ముఖ్యమంత్రి, దళిత నాయకుడు మొట్టమొదటి ముఖ్యమంత్రి అవుతాడని, దళితులకు మూడెకరాల భూ పంపిణీ చేస్తామని హామీలను నెరవేర్చకుండా నేడు 125 అడుగుల అంబేద్కర్‌ విగ్రహాన్ని ఏర్పాటు చేసి దళితుల ఆత్మ గౌరవాన్ని కాపాడుతున్నామని మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌, మేడిపల్లి సత్యం, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, శ్రావణ్‌నాయక్‌, మేనేని రోహిత్‌ రావు, పులి ఆంజనేయులుగౌడ్‌, నాగి శేఖర్‌, సుజిత్‌ కుమార్‌, పోచయ్య, రవీందర్‌, లింగంపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్‌ నేతలు


జయంతి సభలో గలాటా



కరీంనగర్‌: అంబేద్కర్‌ జయంతి సందర్భంగా కోర్టు చౌరస్తాలో ఏర్పాటు చేసిన వేడుకల్లో దళిత నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో సభలో కాసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాలను సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది. జయంతి సభలో హుస్నాబాద్‌కు చెందిన కట్కూరి రాజు మాట్లాడుతూ అంబేద్కర్‌ ఆశయ సాధన కోసమంటూ ఒక వర్గం నాయకులు తమను చిన్నచూపు చూస్తున్నారని తీరు మార్చుకోవాలని వివాదాస్పద వాఖ్యలు చేయడంతో మరో వర్గానికి చెందిన నాయకులు ఒక్కసారిగా వాగ్వాదానికి దిగారు. జయంతి సభలో ఇలాంటి వాఖ్యలు తగవని వెంటనే ఉపసంహరించుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేయడంతో సభలో ఒక్కసారిగా అలజడి చెలరేగింది. పోలీసులు జోక్యం చేసుకొని రాజును వేదికపై నుంచి వేరే చోటికి తీసుకెళ్లడంతో ఉద్రిక్త వాతావరణానికి తెరపడింది.

విద్యుత్‌ మోటార్‌ చోరీ

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
- దొంగిలించిన చోట వదిలివెళ్లిన దొంగలు



పాలకుర్తి(రామగుండం): మండలంలోని బామ్లానాయక్‌తండా సర్పంచ్‌ బదావత్‌ రాజునాయక్‌కు చెందిన వ్యవసాయ బావి విద్యుత్‌ మోటార్‌ను బుధవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. ఈమేరకు గురువారం సర్పంచ్‌ బసంత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యుత్‌ మోటార్‌ విలువ దాదాపు రూ.40వేలు ఉంటుందని, బుధవారం రాత్రి రాణాపూర్‌ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి, కన్నాల గ్రామానికి చెందిన మరో వ్యక్తి ఆటోతో తన పొలం సమీపంలో సంచరించినట్లు స్థానికులు తనకు తెలిపారని, సదరు వ్యక్తులే చోరీకి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ రాజునాయక్‌ ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా గురువారం రాత్రి సమయంలో దొంగలు మళ్లీ మోటార్‌ను సర్పంచ్‌ పొలం వద్ద వదిలివెళ్లారు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రాజునాయక్‌కు మోటార్‌ కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. గతంలో కూడా బామ్లానాయక్‌తండాలో తాగునీటిని సరఫరా చేసే బోర్‌వెల్‌ మోటార్‌తో పాటు ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోలార్‌ విద్యుత్‌ లైట్లకు సంబంధించి బ్యాటరీలు చోరీకి గురయ్యాయి.

జిల్లా కోర్టులో అంబేద్కర్‌ జయంతి



కరీంనగర్‌క్రైం: జిల్లా కోర్టు సముదాయంలో శుక్రవారం అంబేద్కర్‌ జయంతిని ఘనంగా నిర్వహించారు. కరీంనగర్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు బి.రఘునందన్‌రావు, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు ఆధ్వర్యంలో అంబేద్కర్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే, న్యాయవాది ఆరెపల్లి మోహన్‌, అసోసియేషన్‌ మాజీ అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్‌, ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, ఏపీపీ గడ్డం లక్ష్మణ్‌, అసోసియేషన్‌ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కాపర్‌వైరు చోరీ నిందితుల అరెస్ట్‌

ధర్మపురి : విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్‌వైర్లను ఎత్తుకెళ్తున్న ఇద్దరి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ధర్మపురి సీఐ బిల్లా కోటేశ్వర్‌ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ధర్మపురిలోని గిరుకల కాలనీకి చెందిన గుమ్ముల అనిల్‌, గోదావరిఖని సంజయ్‌ నగర్‌కు చెందిన గుర్రాల చంటి కొంతకాలంగా విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్‌ వైర్లను ఎత్తుకెళ్తున్నారు. దీనిపై రైతులు గతంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ కోటేశ్వర్‌, ఎస్సై కిరణ్‌కుమార్‌ ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బందితో ధర్మపురిలోని కమలాపూర్‌ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. గుమ్ముల అనిల్‌, గుర్రాల చంటి అనుమానాస్పదంగా కనిపించడంతో సోదాచేశారు. సుమారు 80 కిలోల కాపర్‌ వైరును వారినుంచి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ధర్మపురి, వెల్గటూర్‌ ఎస్సైలు కిరణ్‌కుమార్‌, నరేశ్‌, హెడ్‌ కానిస్టేబుల్‌ రాజు, సిబ్బందిని సీఐ అభినందించారు.

ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి


సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌

హుజూరాబాద్‌: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్‌ అంబేద్కర్‌ జయంతిని పురస్కరించుకొని ప్రైవేట్‌ ఆసుపత్రుల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకరావాలని సేవ్‌ ఇండియన్‌ కాన్స్టిట్యూషన్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తూరు రమేశ్‌ డిమాండ్‌ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలు తమ వైద్యానికి లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. ప్రభుత్వపరంగా ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్‌ భారత్‌ లాంటి పథకాలు ఉన్నా అవి కొన్నిసార్లు ప్రజలకు అందుబాటులో ఉండడటం లేదన్నారు. ప్రజలకు సొంతంగా హెల్త్‌ ఇన్సూరెన్స్‌ చేసుకునే స్థోమత లేక ప్రమాదాలకు గురైనప్పుడు, గుండెపోటు లాంటి పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంబేద్కర్‌ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రైవేటు, కార్పొరేట్‌ ఆసుపత్రుల్లో ఫీజుల విషయంలో చట్టం తేవాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో పంబు శ్రీనివాస్‌, గడ్డం దయాకర్‌, పర్లపల్లి ఆంజనేయులు, కోతి శ్రీనివాస్‌, అనుదీప్‌, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి


మల్లేశ్‌ మృతదేహం

కొత్తపల్లి(కరీంనగర్‌): కరీంనగర్‌లోని కొత్తపల్లి తహసీల్దార్‌ కార్యాలయ ఆవరణలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ మండలంలోని ఖాజీపూర్‌ హామ్లెట్‌ ఐలవోనిపల్లెకు చెందిన రైతు అనుగుల మల్లేశ్‌(55) చికిత్స పొందుతూ శుక్రవారం వేకువజామున మృతిచెందాడు. కార్యాలయ ఆవరణలో గల బెంచీపై కూర్చొని గురువారం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిన రైతును చికిత్స నిమిత్తం కరీంనగర్‌ ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం మెరుగైన చికిత్స కోసం అపోలో ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే. అయితే చికిత్స పొందుతూ ఆ రైతు మృతి చెందడం ఆ కుటుంబంలో విషాదం నింపింది. ఐలవోనిపల్లెలోని 298 సర్వేనంబర్‌లో గల 20 గుంటల ఇంటి స్థలం సమస్య రెవెన్యూలో ఎలా పరిష్కరించుకోవాలో తెలియక రెండేళ్లుగా కార్యాలయం చుట్టూ తిరిగి విసిగి వేసారిన ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రైతు మృతితో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. కాగా మల్లేశ్‌ ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించి ఆయన కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షల నష్టపరిహారంతోపాటు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని బీజేపీ మండల శాఖ డిమాండ్‌ చేసింది. బాధిత కుటుంబాన్ని శుక్రవారం బీజేపీ నాయకులు పరామర్శించారు.

విద్యుదాఘాతంతో అసిస్టెంట్‌ లైన్‌మన్‌..


సాయిప్రసన్నకుమార్‌ (ఫైల్‌)

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్‌ సబ్‌స్టేషన్‌లో అసిస్టెంట్‌ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న సొల్లేటి సాయిప్రసన్న కుమార్‌ (28) శుక్రవారం విద్యుత్‌ మరమ్మతులు నిర్వహిస్తూ కరెంట్‌ షాక్‌తో మృతిచెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సాయిప్రసన్న కుమార్‌ తండ్రి సొల్లేటి రవీందర్‌ గతంలో విద్యుత్‌ శాఖలో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తూ 2015లో గుండెపోటుతో మృతిచెందాడు. తండ్రి మృతితో సాయిప్రసన్న కుమార్‌కు జూనియర్‌ లైన్‌మన్‌ ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం రుక్మాపూర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో అసిస్టెంట్‌ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం అంబేద్కర్‌ జయంతి రోజున రుక్మాపూర్‌ నుంచి కాట్నపల్లి వెళ్లు దారిలో ఫీడ్‌ పనులు నిర్వహిస్తున్న సమయంలో విద్యుత్‌ సరఫరా కావడంతో షాక్‌తో కిందపడి పోయాడు. చేతులు, కాళ్లకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సాయిప్రసన్న కుమార్‌ వెంట ఉన్న మరో ఉద్యోగి శ్రీకాంత్‌ వెంటనే తల్లి సొల్లేటి సుజాతకు ఫోన్‌ ద్వారా సమాచారం అందించగా, ఆమె వచ్చి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. రుక్మాపూర్‌ సబ్‌స్టేషన్‌ ఏఈ, లైన్‌ ఇన్‌స్పెక్టర్‌, లైన్‌మన్‌లో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే తన కుమారుడు మృతిచెందాడని సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉపేంద్రచారి తెలిపారు.

కేబుల్‌ బ్రిడ్జి ఐలాండ్‌లోకి దూసుకెళ్లిన కారు

- ప్రమాదాలు పెరిగే అవకాశాలున్నాయని ముందే చెప్పిన ‘సాక్షి’
- ఫ్లైఓవర్‌ నిర్మిస్తేనే ప్రమాదాల నియంత్రణ


ఐలాండ్‌లోకి దూసుకెళ్లిన కారు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌ నుంచి వరంగల్‌ వెళ్లేందుకు నూతనంగా నిర్మించిన కేబుల్‌ బ్రిడ్జి చౌరస్తా వద్ద ప్రమాదం జరిగింది. గురువారం అర్ధరాత్రి కరీంనగర్‌ నుంచి పెద్దపల్లి వెళ్తున్న ఒక కారు వేగంగా వచ్చి నూతనంగా నిర్మిస్తున్న ఐలాండ్‌లోకి దూసుకెళ్లింది. కారులో ఉన్నవారిలో ఒకరికి గాయాలు అయినట్లు తెలిసింది. కాగా ‘సాక్షి’లో ఇటీవల చావు‘రస్తా’ల పేరుతో నగరంలోని ప్రమాదకర కూడళ్లపై రాసిన కథనంలో కేబుల్‌ బ్రిడ్జి వద్ద ప్రమాదాలు పెరిగే అవకాశాలున్నాయని ముందే తెలిపింది. కేబుల్‌ బ్రిడ్జి చౌరస్తాలో ఒక ఫ్లైఓవర్‌ నిర్మిస్తే ప్రమాదాలు నియంత్రించే అవకాశముంటుందని, ఫ్లై ఓవర్‌ లేకుండా ఉంటే ప్రమాదాలు పెరుగుతాయని ఓ సీనియర్‌ పోలీసు అధికారి తెలిపారు.

బారికేడ్లు ఏర్పాటు

కేబుల్‌ బ్రిడ్జి వద్ద ప్రమాదం జరిగిందని తెలుసుకున్న టౌన్‌ ఏసీపీ తుల శ్రీనివాస్‌రావు, సీఐ సీహెచ్‌.నటేశ్‌, ట్రాఫిక్‌ పోలీసులతో కలిసి చౌరస్తాకు వచ్చే మార్గాల్లో వాహనాలు వేగం తగ్గించేలా ఒక పక్క భారీ కేడ్లు ఏర్పాటు చేయించారు. గురువారం రాత్రి సిబ్బందితో భారీకేడ్లు పెట్టించి పనులను పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతామని పేర్కొన్నారు.

ఆదర్శప్రాయుడు అంబేద్కర్‌


పూలమాల వేస్తున్న ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్‌


నివాళి అర్పిస్తున్న ఆర్జీ–2 జీఎం మనోహర్‌

- ఆర్జీ–1,2 జీఎంలు శ్రీనివాస్‌, మనోహర్‌

గోదావరిఖని(రామగుండం): రాజ్యాంగాన్ని రచించి ప్రపంచదేశాలకు ఆదర్శప్రాయునిగా డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ నిలిచారని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్‌ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కూరగాయల మార్కెట్‌ సమీపంలోని అంబేద్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అంతకముందు జీఎం కార్యాలయం వద్ద జెండా ఎగురవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్లేయుల పాలనలో ఉన్నత విద్యనభ్యసించి భావితరాలకు తిరుగులేని భవిష్యత్‌ అందించే భారత రాజ్యాంగాన్ని రచించారన్నారు. దేశప్రజలందరూ ఐకమత్యంగా జీవించాలని సూచించారన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్‌ ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌ రావు, సీఎంఓఏఐ అధ్యక్షుడు పొనగోటి శ్రీనివాసు, డీజీఎం పర్సనల్‌ లక్ష్మీనారాయణ, లైజన్‌ ఆఫీసర్లు దొంత వెంకటేశ్వర్లు, కారం పద్మ పాల్గొన్నారు.

బడుగుబలహీన అభ్యున్నతికి కృషి

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహా నేత అంబేద్కర్‌ అని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్‌ పేర్కొన్నారు. శుక్రవారం యైటింక్లయిన్‌ కాలనీ ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అంతకముందు జీఎం పంచశీల జెండా ఎగురవేశారు. సమాజంలో అసమానతలు తొలగిపోవాలని అహర్నిశలు కృషి చేశారన్నారు. ఒకే విధమైన రాజ్యాంగంతో ప్రజలందరినీ ఒకేతాటిపై నడిపించడం గొప్ప విషయమన్నారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు, టీబీజీకేఎస్‌ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్‌, ఎస్‌ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, రాంరెడ్డి, లైజన్‌ అధికారి రాజేంద్రప్రసాద్‌, ఎస్సీ,ఎస్టీ సంఘం నాయకులు బదావత్‌ శంకర్‌నాయక్‌, బొక్కల శ్రీనివాస్‌ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏరియాలోని అన్ని గనులపై అంబేద్కర్‌ జయంతిని ఘనంగా నిర్వహించారు.

సురక్షిత నీటి కోసం శాశ్వత ప్రణాళికలు


ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న జీఎం, తదితరులు

గోదావరిఖని(రామగుండం): సురక్షితమైన నీటిని సింగరేణి ఉద్యోగుల వాడలకు సరఫరా చేసేందుకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్‌ సూచించారు. శుక్రవారం ఏరియాలోని గంగానగర్‌లో గల ఫిల్టర్‌బెడ్‌లను పరిశీలించారు. ఫిల్టర్‌బెడ్‌లో ఉన్న ఇసుకను మార్చడంతో పాటు క్లోరినేషన్‌ సరైన విధంగా చేయాలన్నారు. గోదావరినదిలో నీటి ప్రవాహం లేకపోవడం మూలంగా రంగు మారుతోందన్నారు. జీఎం వెంట ఏరియా ఇంజినీర్‌ రామ్మూర్తి, ఆంజనేయప్రసాద్‌ తదితరులున్నారు.

మండే ఎండల్లోనూ... అందంగా... ఆరోగ్యంగా

ఎండాకాలం కాసేపు బయటికి వెళితే చాలు ముఖ చర్మం కమిలిపోతుంది. విపరీతంగా చెమటలు పోస్తాయి. నీరసం, నిస్త్రాణ కలుగుతాయి. కాసేపు పని చేస్తే చాలు శరీరం అలసిపోయి, సొమ్మసిల్లినట్లు అవుతుంది. బయటికి వెళ్లేటప్పుడు కొన్ని చిట్కాలు పాటిస్తే ఎండల్లోనూ అందంగా ఆరోగ్యంగా ఉండవచ్చు. అవేమిటో చూద్దాం...



మంచి నీటిని మించిన ఔషధం లేదు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడేది మంచినీరు మాత్రమే. కాబట్టి ఇప్పటి నుంచీ దాహం వేసినా వేయకపోయినా వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగడం అలవాటుగా మార్చుకోండి.

- గుప్పెడు పుదీనా ఆకులను తాగే నీటిలో వేసుకుంటే... శరీరం చల్లగా ఉంటుంది. ఈ కాలంలో పుదీనా టీని ఎంచుకుంటే మరీ మంచిది. ఎండ ప్రభావాన్ని కొంతవరకూ తట్టుకోగలుగుతారు.
- నిమ్మరసం వేసవికి ఔషధం లాంటిది. ఉదయాన్నే గ్లాసు నీటిలో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.
- ఉప్పు, కొద్దిగా మసాలాలు జోడించి పెరుగు చిలికి చేసే మజ్జిగ శరీరంలో వేడిని చల్లారుస్తుంది. డీహైడ్రేషన్ ను నివారిస్తుంది. ఇది ఎలక్ట్రొలైట్ల భరితం. వేసవి తాపంతో పోరాడటానికి మజ్జిగ ఒక మంచి ఆప్షన్. దీనిలో క్యాలరీలు తక్కువ. కాల్షియం, పొటాషియంతో పాటు ప్రొటీన్ కూడా దీని నుంచి దొరుకుతుంది. అసిడిటీని తగ్గిస్తుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అదేవిధంగా పెరుగు తీసుకోవడం కూడా మంచిదే.
- గసగసాలను ఎక్కువగా ఆహారపదార్థాల్లో వాడాలి. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. అంతే కాదు, వేడిని తగ్గించి, శరీరాన్ని చల్లగా ఉంచుతాయి.
- కొత్తిమీరను ఆహారంలో అధికంగా తీసుకోవాలి. కొత్తిమీర రసం లేదా వంటకాల్లో దీన్ని వాడినా... శరీరంలోని అధిక ఉష్ణోగ్రత అదుపులో ఉంటుంది.



చర్మ సంరక్షణ ముఖ్యం

- వేసవిలో సన్‌స్క్రీన్ లోషన్‌ని రాసుకోవడం వల్ల చర్మానికి సమస్యలు తగ్గుతాయి. ఈ సన్‌స్క్రీన్ లోషన్‌ని బయటికి వెళ్లినప్పుడు మాత్రమే కాకుండా ఇంట్లో ఉన్నప్పుడు కూడా అప్లై చేసుకోండి. సన్‌స్క్రీన్ లోషన్ వాడటం వల్ల చర్మ సమస్యలు ఉండవు. అలాగే చర్మానికి రక్షణ ఉంటుంది.
- ఎండల్లో బయటకు వెళ్ళినప్పుడు చర్మాన్ని కవర్ చేసుకోవడం అవసరం. కాబట్టి మీరు బయటకు వెళ్లేటప్పుడు గొడుగుని తీసుకు వెళ్లడం మర్చిపోకండి. అలానే ఎండాకాలంలో బయటకు వెళ్ళేటప్పుడు సన్ గ్లాసెస్‌ని ధరించడం, తలకు పెద్ద టోపీ పెట్టుకోవడం పైగా ఎలాంటి సమస్యలూ రావు.
- వేసవిలో ఆయిల్ ఫుడ్స్‌కి దూరంగా ఉండాలి. ఇంటి వంటలలో కూడా నూనె వాడకం తగ్గించాలి.
- ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. మసాలా కూరలు తగ్గించాలి.
- అల్పాహారంగా ఆవిరి కుడుములు, ఇడ్లీ వంటివి తీసుకుంటే మేలు.
- కర్బూజా, పుచ్చకాయలు, ఈత కాయలు, తాటి ముంజలు వంటి సీజనల్ పండ్లు ఆరోగ్యానికి చాలా మంచిది.
- వేసవిలో రోజుకోసారి రాగిజావ తీసుకోవడం వల్ల కడుపులో చల్లగా ఉండటంతోపాటు మరెన్నో లాభాలు ఉన్నాయి. రాగుల్లో క్యాల్షియం పుష్కలంగా ఉంటుంది. దీన్ని ప్రతిరోజూ తీసుకోవడం వల్ల ఎముకలు దృఢంగా ఉంటాయి.

నీళ్లు ఏ బాటిల్‌లో తాగుతున్నారు..?

అసలే ఎండాకాలం.. దాహం వేస్తుంటుంది. ఇంట్లో ఉన్నప్పుడంటే కావలసినప్పుడల్లా నీళ్లు తాగుతుంటాం. మరి బయటికి వెళ్లేటప్పుడు? అందులో ఆలోచించేదేముంది... ఒక వాటర్ బాటిల్ తీసుకెళతాం.. అంతే కదా అని సింపుల్‌గా చెప్పేస్తాం. అయితే ఆ బాటిల్ దేనితో తయారు చేసింది... అంటే నూటికి తొంబై పాళ్లు 'ప్లాస్టిక్ బాటిల్' అనే సమాధానం వస్తుంది. దాహం వేసినప్పుడు నీళ్లు తాగడం వల్ల ఎంత ఉపయోగమో, ప్లాస్టిక్ బాటిల్స్‌లో నీళ్లు తాగడం అంత ప్రమాదం. అది ఎండాకాలం అయితే కనక ఈ ప్రమాదం ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఇంతకీ ఏమిటా నష్టాలు అంటారా? అదే చూద్దాం..

ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి ముప్పు అని పదే పదే చెబుతున్నా కూడా ప్లాస్టిక్ ఇంకా వాడకంలోనే ఉండటానికి కారణం ఏమిటంటే, దానిని క్యారీ చేయడం చాలా సులువు. నిర్వహించడం ఇంకా సులువు. ఒకవేళ ఎక్కడైనా పెట్టి మరచిపోయినా పెద్ద ఖరీదు ఉండదు కాబట్టి దిగులు పడనక్కరలేదు. అందువల్ల పర్యావరణ ప్రేమికులు ఎంతగా నెత్తీ నోరు బాదుకుంటున్నా, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించే విషయంలో వెనకబడవలసి వస్తోంది.

- ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ అయినా, భారీ ప్లాస్టిక్ కంటైనర్లు అయినా వాటి నుంచి నీరు తాగడం ప్రమాదకరం. ముఖ్యంగా ఎండలో ఎక్కువగా ఉంచిన ప్లాస్టిక్ బాటిల్స్‌లోని నీటిని అసలు తాగకూడదు.
- పరిశోధన ప్రకారం.. ప్లాస్టిక్ బాటిల్స్ మీద ఎండ పడితే.. అవి మైక్రోప్లాస్టిక్‌లను విడుదల చేస్తాయి. అలాంటి పరిస్థితుల్లో మనం ఈ నీటిని తాగితే.. శరీరంలోని హార్మోన్ల సమతుల్యతను కాపాడే.. ఎండోక్రైన్ వ్యవస్థ ప్రభావితం అవుతుంది. ఇలాంటి నీటిని ఎక్కువగా తీసుకుంటే.. ఆరోగ్యం దెబ్బతింటుంది. కాలేయాన్ని కూడా పాడు చేస్తుంది.
- ఎండలో ఉండే.. ప్లాస్టిక్ బాటిల్ నుంచి దయాక్సిన్ లాంటి టాక్సిన్ నీటిలోకి విడుదల అవుతుంది. ఈ దయాక్సిన్ నీటిని తాగితే.. బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. ప్లాస్టిక్ బాటిల్ నీళ్ల తాగితే.. వ్యాధి నిరోధక శక్తి కూడా తగ్గుతుంది. మగవారిలో శుక్ర కణాల సంఖ్య కూడా తగ్గవచ్చు.



బాటిల్ వాటర్‌లో మైక్రో ప్లాస్టిక్స్ స్థాయిలు ఎక్కువగా ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

- మైక్రోప్లాస్టిక్స్ కలిసిన నీటిని తాగితే పొత్తి కడుపునకు సంబంధించిన అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. హార్మోన్ల అసమతుల్యం, పీసీఓఎస్, ఒవేరియన్ సమస్యలు, బ్రెస్ట్ క్యాన్సర్, కోలన్ క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్, ఇతర అనారోగ్య సమస్యలు రావొచ్చు.
- ప్లాస్టిక్ బాటిల్స్‌లో నీటిని తాగితే ఆరోగ్యానికి మంచిది కాదు. బయటకు వెళ్లినప్పుడు ప్లాస్టిక్ బాటిళ్లకు ఎండ తగిలితే.. అస్సలే తాగొద్దు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాటిళ్లను కొంతమంది అలానే ఉపయోగిస్తారు. ఇంటికి తీసుకొచ్చి ఫ్రిడ్జ్‌లో పెట్టుకుంటారు. ఇది ఇంకా అపాయకరమైనది. ఇలా అస్సలు చేయొద్దు ఎప్పుడూ.

ఏం చేయాలి మరి?

ప్లాస్టిక్ బాటిల్స్ అంతగా వాడుకలోకి రాని రోజుల్లో పెద్దవాళ్లు ఎక్కడికైనా వెళ్లేటప్పుడు స్టీలు లేదా ఇత్తడి మరచెంబులు తీసుకు వెళ్లేవారు. ఇప్పుడు కూడా అదే మంచిది. అందుకు తగ్గట్టు ఇప్పుడు మార్కెట్‌లో రకరకాల సైజుల్లో, ఆకారాలలో రాగి, స్టీలు, ఇత్తడి బాటిల్స్ అందుబాటులోకి వచ్చాయి. ఇవి కాస్తంత ఖరీదు ఎక్కువైనా, ప్లాస్టిక్ వాడకం వల్ల తలెత్తే అనారోగ్య సమస్యలతో పోల్చుకుంటే ఫరవాలేదనిపిస్తుంది.

- ప్లాంట్ బేస్డ్ బాటిల్స్, గాజుసీసాలు, అల్యూమినియం వాటర్ క్యాన్స్ కూడా అందుబాటులోకి వస్తున్నాయి. మనం వాడకం మొదలు పెడితే ధరలు కూడా అందుబాటులోనే ఉంటాయి.

మీకు తెలుసా?



రోజంతా చురుకుగా, ఆరోగ్యంగా ఉండాలంటే అల్పాహారం తీసుకోవడం అవసరం. దీనిలో మొలకెత్తిన గింజలు, ఉడికించిన కోడిగుడ్లు, నూనె లేకుండా చేసిన చపాతీలు, పండ్ల రసాలే కాక... ఐదు నానబెట్టిన బాదం పప్పులు, పండ్లు, కూరగాయలతో కలగలిపిన సలాడ్ లు వంటివి తీసుకుంటుంటే అనారోగ్యాన్ని కలిగించే వైరల్ ఇన్‌ఫెక్షన్‌లు దరిచేరవు. వీటితోపాటు.. తీసుకునే అల్పాహారంగా కార్బోహైడ్రేట్లు సమృద్ధిగా ఉండే ఆహారపదార్థాలు తీసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గడమే కాకుండా, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అలాగే డైటింగ్ చేసే వారు నిర్లక్ష్యం చేయకుండా.. అల్పాహారం తీసుకోవడం మరువకూడదు.

గ్యాస్ ఆదా చేద్దామా?

ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ ఇప్పుడు వంటకు గ్యాసే వాడుతున్నారు. దాంతో వంట గ్యాస్ ధర రోజురోజుకీ పెరిగి మంట గ్యాస్‌గా మారిపోతోంది. అందుకే దాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటే ఎక్కువకాలం పాటు గ్యాస్ వచ్చే విధంగా చూసుకోవచ్చు. గ్యాస్ ఆదాకు చిట్కాలు తెలుసుకుందాం...



వంట చేసేటప్పుడు రోజులో ఒకేసారి ఎక్కువ మొత్తంలో కూర వండుకోవడం మంచిది. ఉదయం ఒకసారి, మధ్యాహ్నం ఒకసారి, రాత్రి ఒకసారి... ఇలా వండడం వల్ల గ్యాస్ ఎక్కువ మొత్తంలో పోతుంది. అదే మధ్యాహ్న భోజనం చేయడానికి ఒక గంట ముందు వండుకుంటే, అదే కూర మధ్యాహ్నానికి, రాత్రికి కూడా వస్తుంది. దీనివల్ల రెండు మూడుసార్లు గ్యాస్‌ను వాడాల్సిన అవసరం రాదు.

- **ప్రెషర్ కుకర్ బెస్ట్:** ప్రెషర్ కుకర్ అధిక పీడనం కింద ఆవిరి మీద ఆహారాన్ని ఉడికిస్తుంది పైగా రెండు మూడు రకాలను ఒకేసారి కుకర్‌లో పెట్టవచ్చు కాబట్టి తక్కువ సమయంలో వంట పూర్తవుతుంది. గ్యాస్ కూడా ఆదా అవుతుంది.
- చిన్నగిన్నెలో వంటలు చేస్తున్నప్పుడు పెద్ద బర్నర్ వాడకూడదు. అలా వాడటం వల్ల మంట చాలా మటుకు బయటికి పోతుంది. దాంతో ఆ మేరకు గ్యాస్ వృథా అయినట్లే కదా.. అందువల్ల సాధ్యమైనంత వరకు చిన్న బర్నర్‌నే వాడటం మంచిది.
- బర్నర్లను తరచూ శుభ్రపరుస్తూ ఉండాలి. ఇలా చేయడం వల్ల అది త్వరగా వేడెక్కి వంట త్వరగా పూర్తయ్యేలా చేస్తుంది.
- వంట పూర్తవడానికి కొంచెం ముందే స్టవ్ ఆపి వేయండి. గిన్నె మీద మూత మాత్రం తీయవద్దు. లోపల ఉన్న వేడి ఆ మిగతా వంటను పూర్తి చేస్తుంది. దీనివల్ల గ్యాస్ ఆదా అవుతుంది.
- వంట చేస్తున్నప్పుడు గిన్నె మీద మూత పెట్టే ఉంచండి. ఎందుకంటే మూత పెట్టడం వల్ల లోపల ఉన్న వేడి బయటికి పోదు. ఆ వేడి మీదే త్వరగా ఉడుకుతుంది. అదేవిధంగా స్నానానికి వేడినీళ్లను గ్యాస్ మీద పెట్టవద్దు. నీళ్ల వేడెక్కడానికి చాలా సమయం పడుతుంది. దాంతో ఎక్కువ గ్యాస్ వాడాల్సి వస్తుంది.
- పగటిపూట వంట చేస్తున్నప్పుడు వంటగదిలోని లైట్లను ఆన్ చేయవద్దు. దీనివల్ల శక్తి ఆదా అవుతుంది. అలాగే మీకు తెలియకుండానే గ్యాస్ వినియోగం కూడా తగ్గుతుంది.

ఈ చిట్కాలన్నీ పాటించడం వల్ల గ్యాస్ సిలెండర్ దాదాపు పది రోజులు అదనంగా వచ్చే అవకాశం ఉంది.

సినిమా

కేరాఫ్ ఫారిన్

సమ్మర్‌లో కూల్‌గా ఉండే లొకేషన్స్‌ని ఎంచుకుని, వెకేషన్‌కి వెళుతుంటారు కొందరు స్టార్స్. కొందరిని షూటింగే చల్లని ప్రాంతాలకు తీసుకెళుతుంది. అలా 'కేరాఫ్ ఫారిన్' అంటూ షూటింగ్స్‌కి, వెకేషన్‌కి విదేశాలు వెళ్లిన స్టార్స్ గురించి తెలుసుకుందాం.


● కమల్‌హాసన్


● ప్రభాస్


● అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్

- రెండు వారాలుగా ఫారిన్‌లోనే ఉంటున్నారు ఇండియన్. హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'ఇండియన్' ('భారతీయుడు') సినిమాకు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల తైవాన్‌లో జరిగిన ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం సౌతాఫ్రికాలో జరుగుతోంది. కమల్‌పై ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ తీస్తున్నారు శంకర్. ఈ వారం కూడా 'ఇండియన్ 2' టీమ్ సౌతాఫ్రికాలోనే ఉంటుందని తెలిసింది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రకుల్‌ప్రీత్ సింగ్, బాబీ సింహా కీలక పాత్రలు చేస్తున్నారు.
- ఇటలీలో ఫైట్స్ చేశారు ప్రభాస్. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'సలార్' చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ గత నెలలో ఇటలీ లొకేషన్స్‌లో జరిగింది. ముఖ్యంగా ప్రభాస్‌పై యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా 'సలార్' సినిమా యూనిట్ మరోసారి ఫారిన్ వెళ్లనుందని సమాచారం. బుడాపెస్ట్ లొకేషన్స్‌లో 'సలార్' షూటింగ్‌ను ప్లాన్ చేశారు. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్నారు. 'సలార్' చిత్రం సెప్టెంబరు 28న విడుదల కానుంది. ఇదిలా ఉంటే... ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న 'రాజా డీలక్స్' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రీకరణలో ప్రభాస్ పాల్గొంటున్నారని తెలిసింది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి కాగానే 'సలార్' కోసం ప్రభాస్ ఫారిన్ ఫ్లైట్ ఎక్కుతారని ఫిల్మ్‌నగర్ సమాచారం.
- లండన్‌లో ప్రేమ పాఠాలు నేర్చుకుంటున్నారు శర్వానంద్. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో శర్వానంద్, కృతీ శెట్టి జంటగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల లండన్‌లో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ఇంకా కొనసాగుతోంది. గత వారం శర్వానంద్, కృతీపై కీలక సన్నివేశాలు, ఓ పాట చిత్రీకరించారు.
- బాలీవుడ్ 'బడే మియా చోటే మియా' లండన్‌కు షిఫ్ట్ అయ్యారు. అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'బడే మియా చోటే మియా'. ఇటీవల ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను స్కాట్లాండ్‌లో చిత్రీకరించారు. అట్నుంచి అటు లండన్ వెళ్లారు. మరో పది రోజులపాటు లండన్ షెడ్యూల్ జరుగుతుందట. అలాగే మరో బాలీవుడ్ మూవీ 'యానిమల్' షూటింగ్ కూడా లండన్‌లో జరిగింది. 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్.

ఈ చిత్రాలతో పాటు మరికొన్ని చిత్రాలు ఫారిన్ లొకేషన్స్‌లో షూటింగ్స్‌ను ప్లాన్ చేశాయి.


● రణ్‌బీర్ కపూర్


● శర్వానంద్

సమ్మర్ బ్రేక్


● మహేశ్‌బాబు


● రామ్‌చరణ్


● ఎన్టీఆర్

షూటింగ్స్‌కు సమ్మర్ బ్రేక్ ఇచ్చారు కొందరు స్టార్ హీరోలు. ప్రతి ఏడాది సమ్మర్‌కు ఫ్యామిలీతో కలిసి వెకేషన్‌కు వెళ్లే మహేశ్‌బాబు ఈ ఏడాది కూడా ఫారిన్ టూర్ వెళ్లారు. ఫ్యామిలీతో కలిసి విదేశాల్లో వెకేషన్ టైమ్‌ను ఆస్వాదిస్తున్నారు. మహేశ్ ఫ్యామిలీ ప్రస్తుతం జర్మనీలో ఉన్నట్లు తెలిసింది. ఈ ఫారిన్ వెకేషన్‌ను పూర్తి చేసుకుని వచ్చిన తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో తాను హీరోగా నటిస్తున్న సినిమా షూటింగ్‌లో జాయిన్ అవుతారు మహేశ్‌బాబు. మరోవైపు 'జనతా గ్యారేజ్' చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. హైదరాబాద్‌లో ఇటీవల మొదలైన ఈ సినిమా తొలి షెడ్యూల్ ముగిసింది. నెక్ట్స్ షెడ్యూల్ గోవాలో ప్లాన్ చేశారు. అయితే ఈ సినిమా షూటింగ్ నుంచి ఎన్టీఆర్ స్మాల్ బ్రేక్ తీసుకున్నారని తెలిసింది. గోవా షెడ్యూల్‌లో వచ్చే నెల జాయిన్ అవుతారట ఎన్టీఆర్. ఇక రామ్‌చరణ్ ఫుల్ వెకేషన్ మోడ్‌లో ఉన్నారు. ఇటీవల రామ్‌చరణ్, ఆయన సతీమణి ఉపాసన దుబాయ్ వెళ్లొచ్చారు. ప్రస్తుతం ఈ దంపతులు మాల్దీవుల్లో ఉన్నారు. ఈ వెకేషన్‌ను పూర్తి చేసిన తర్వాత రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్' షూటింగ్‌లో పాల్గొంటారు. శంకర్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది.

నేను సింగిల్

'ప్రస్తుతం నేను సింగిల్‌గానే ఉన్నాను.. అలా ఉండటమే నాకు ఇష్టం' అంటున్నారు హీరోయిన్ పూజా హెగ్డే. సల్మాన్ ఖాన్ హీరోగా ఫర్హాద్ సామ్జీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కిసీ కా భాయ్.. కిసీ కీ జాన్'. సల్మాన్ ఖాన్ ఫిల్మ్స్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ చిత్రంలో సల్మాన్ ఖాన్‌కి జోడీగా నటించారు పూజా హెగ్డే. కాగా ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నప్పటి నుంచి సల్మాన్, పూజా హెగ్డే డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. పైగా మంగళూరులో జరిగిన పూజ సోదరుడు రిషబ్ హెగ్డే వివాహానికి సల్మాన్ ఖాన్ హాజరవడం డేటింగ్ వార్తలకు మరింత బలం చేకూర్చింది. ఈ వార్తలపై తాజాగా పూజా హెగ్డే స్పందిస్తూ– ''నా గురించి ఎన్నో వార్తలు వస్తుంటాయి. వాటిల్లో సల్మాన్‌గారితో డేటింగ్ అనేది ఒకటి. ఇలాంటి వార్తల గురించి నేను పెద్దగా పట్టించుకోను. ప్రస్తుతం నేను సింగిల్‌గానే ఉన్నాను.. అలా ఉండటమే ఇష్టం. ఇప్పుడు నా దృష్టంతా కెరీర్‌పైనే ఉంది. వేర్వేరు భాషల్లో ఎక్కువ సినిమాల్లో నటించాలన్నదే నా లక్ష్యం. సల్మాన్‌గారితో నటించడం గొప్ప అనుభూతి'' అన్నారు.


● పూజా హెగ్డే

భావోద్వేగాల విమానం


● ధ్రువన్, సముద్ర ఖని

నటుడు, దర్శకుడు సముద్ర ఖని లీడ్ రోల్‌లో శివ ప్రసాద్ యానాల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'విమానం'. మాస్టర్ ధ్రువన్, మీరా జాస్మిన్, అనసూయ భరద్వాజ్, రాహుల్ రామకృష్ణ, ధన్‌రాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జీ స్టూడియోస్, కిరణ్ కొర్రపాటి (కిరణ్ కొర్రపాటి క్రియేటివ్ వర్క్స్) నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోన్న ఈ చిత్రాన్ని జూన్ 9న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ఓ ప్రోమోను విడుదల చేశారు. జీ స్టూడియోస్ సౌత్ మూవీస్ హెడ్ అక్షయ్ క్రేజీవాల్ మాట్లాడుతూ– ''తండ్రీ కొడుకుల మధ్య అనుబంధం నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రం 'విమానం'. అంగ వైకల్యంతో బాధపడే మధ్య వయస్కుడిగా, భార్య లేకపోయినా తనయుణ్ని జాగ్రత్తగా చూసుకునే తండ్రి వీరయ్యగా సముద్రఖని అద్భుతంగా చేశారు. బలమైన కథాంశంతో చక్కని భావోద్వేగాలతో ఈ చిత్రం ఉంటుంది. కిరణ్ కొర్రపాటితో అసోసియేట్ కావటం హ్యాపీ'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వివేక్ కాలేపు, సంగీతం: చరణ్ అర్జున్.


● గుల్షన్ దేవయ్య, గుల్జార్, రాజ్ రాచకొండ

ఇద్దరు అపరిచితుల కథ

గుల్షన్ దేవయ్య, సయామీ ఖేర్ జంటగా 'మల్లేశం' చిత్రం ఫేమ్ రాజ్ రాచకొండ దర్శకత్వం వహించిన చిత్రం '8 ఏఎమ్ మెట్రో'. శిలాదిత్య బోరా ప్లాటూన్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా మే 19న ఈ సినిమా రిలీజ్ కానుంది. ప్రముఖ గేయ రచయిత, దర్శకుడు గుల్జార్ ఈ సినిమా పోస్టర్‌ను లాంచ్ చేసి, మాట్లాడుతూ– ''ఈ చిత్రకథ చదివినప్పుడు గొప్ప అనుభూతి కలిగింది. అందుకే నా కవితలు అందించాను'' అన్నారు. ''మెట్రో ట్రైన్‌లో కలుసుకుని, ఒకరినొకరు తెలుసుకునే ఇద్దరు అపరిచితుల కథే ఈ సినిమా'' అన్నారు రాజ్ రాచకొండ. ''ఈ చిత్రంలో నా పాత్రకి ఒక సీక్రెట్ ఉంది. అది ఇద్దర్నీ వేరు చేయడంతో పాటు నమ్మకాల్ని కూడా చీల్చుతుంది'' అన్నారు గుల్షన్.

ఆ సమయంలో రాకీ భాయ్ ఎక్కడ?

హీరో యశ్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వచ్చిన 'కేజీఎఫ్' తొలి, మలి భాగాలకు విశేష స్పందన లభించిన విషయం తెలిసిందే. 'కేజీఎఫ్: ఛాప్టర్ 2' విడుదలై శుక్రవారం (ఏప్రిల్ 14)తో ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా 'కేజీఎఫ్ 2'షార్ట్ వీడియోను ఈ చిత్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ షేర్ చేసింది. '1978 నుంచి 1981వరకు రాకీ భాయ్ ఎక్కడ?, ఆ ప్రామిస్ నిలబడిందా?' అనేవి ఈ వీడియోలో కనిపించాయి. అలాగే '3'తో ఈ వీడియో పూర్తవుతుంది. దీంతో 'కేజీఎఫ్ 3' ఉంటుందని స్పష్టమవుతోంది.


● యశ్

ప్రచండ తరుణం షురూ

అశోక్ రాజ్, రితికా రాజ్, శ్రష్టి వర్మ, వినయ్ బిద్దప్ప, ఉగ్రం మంజు, రవితేజ ప్రధాన పాత్రల్లో 'ప్రచండ తరుణం కారిన్య కావ్యం' అనే సినిమా షురూ అయింది. బాల పులిబోయిన దర్శకత్వంలో పులిచర్ల నాగరాజు, రామచంద్ర, కొల్లకుంట నాగరాజు నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి ప్రొడక్షన్ హెడ్ రాజ్యలక్ష్మి కెమెరా స్విచ్చాన్ చేయగా, కన్నడ హీరో సిద్ధార్థ్ మహేశ్ క్లాప్ కొట్టారు. రచయిత పరుచూరి గోపాలకృష్ణ స్క్రిప్ట్‌ని అందించారు. ''మన పురాణాలు, ఇతిహాసాలను సైన్స్ అండ్ టెక్నాలజీతో బ్యాలెన్స్ చేసి తయారు చేసిన స్క్రిప్ట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది'' అన్నారు దర్శక–నిర్మాతలు.


● రితికా, అశోక్, శ్రష్టి